క్లుప్తంగా

4, 5 తేదీల్లో గణిత శాస్త్రంపై జాతీయ సదస్సు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేసే దిశగా మార్చి నెల 4, 5 తేదీలలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో గణిత శాస్త్ర జాతీయ స్థాయి సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 4,5 తేదీలలో జరిగే ఈ కార్యక్రమానికి దేశంలో పేరెన్నికగన్న విద్యా సంస్థల నుంచి గణితశాస్త్ర అధ్యాపకులు వస్తారన్నారు. గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు, అవకాశాలు వంటి విషయాలను వారు వివరిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గణితంలో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాలరావు, కన్వీనర్లు అనురాధ, తబిత పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వృద్ధుడి అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వృద్ధుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 28 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్‌ఐ దేవసుధ మంగళవారం తెల్లవారుజామున గస్తీ నిర్వహిస్తున్నారు. ఫోర్‌మెన్ బంగ్లా వద్ద ఓ వృద్ధుడు పోలీసులను చూసి పక్కకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో అతడిని పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న సంచిలో మద్యం సీసాలు కనిపించాయి. అతడిని ఆరా తీయగా తాను ఓ బార్‌లో పని చేస్తానని, అదనపు ఆదాయం కోసం ఇలా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తుంటానని చెప్పాడు. దీంతో వృద్ధుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

జక్కంపూడి కాలనీలో బైక్ దగ్ధం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు నిలిచి ఉంచిన బైక్ దగ్ధమైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో జరిగింది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 181లో బత్తుల భానుప్రకాష్ కుటుంబం నివాసం ఉంటోంది. భానుప్రకాష్ బందరురోడ్డులోని ఓ జ్యూయలరీ షోరూమ్‌లో పని చేస్తుంటాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన భానుప్రకాష్ తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. తెల్లవారుజామున ఇంటి ముందు ఏదో పేలిన శబ్దం, టైర్లు కాల్చిన వాసన రావడంతో భానుప్రకాష్ భార్య లేచి చూడగా, ఇంటి ముందు పెట్టిన బైక్ కాలిపోతూ కనిపించింది. దీంతో వెంటనే భర్తను నిద్ర లేపి ఇద్దరూ బయటకు వెళ్లి చూసేసరికి బైక్ పూర్తిగా కాలిపోయింది. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేఎస్ వాస్ మృతి చిత్రకళా రంగానికి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారుడు ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు కేఎస్ వాస్ (77)మృతి చిత్రకళారంగానికి తీరని లోటు అని ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎంవీ సాయిబాబు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో మంగళవారం ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన చిత్రకారుడు కేఎస్ వాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ వాస్ చిత్రకళ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. నగరంలో వందలాది మంది విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు నేర్పించి చిత్రకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్రకారులు మల్లిక్, దుర్గాప్రసాదరావు, రమేష్, సునీల్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొని వాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గౌతమబుద్ధ కేంద్రంలో ధ్యాన శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బుద్ధ విహార్‌లోని గౌతమ బుద్ధ ధ్యాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 25న మొదలైన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన కూరపాటి రఘు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రఘును ధ్యాన కేంద్రం ప్రతినిధులు పసుపులేటి సత్యశ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, మీసాల బాలాజీరావు, తొమ్మండురు నాగేశ్వరరావు, పరాంకుశం పద్మ ఘనంగా సన్మానించారు.

హామీలను అమలు చేసిన ఏకైక సీఎం జగన్

గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో కరపత్రాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్న షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూ.చ తప్పక అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానిపురం 40వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ ఆంజనేయరెడ్డితో కలిసి ఆసిఫ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భవానీ హాస్పిటల్ రోడ్డు, ఎన్టీఆర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ఎందుకు అధికారంలోకి రావాలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని తూ.చ తప్పక అమలు చేశారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టాలని కోరేందుకు ప్రజల వద్దకు వచ్చామన్నారు. ఐదేళ్ల పాలనలో తాము చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటు పేదవాడి సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించేందుకు దోహదం చేస్తుందన్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి

పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత చేసిన అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోందన్నారు. కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రోడ్లు, డ్రైన్లు, పైపులైన్లు నిర్మాణం చేపట్టామన్నారు. మరోసారి పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 175 కు 175 అసెంబ్లీ స్థానాలు తమ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పుణ్యశీల, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, పాత శివాలయం చైర్మన్ బొమ్మ మధు, వైఎస్సార్‌టీయూసీ జోనల్ చైర్మన్ నంబూరి ప్రదీప్, కేసరి చిన్నోడు, బాజీ బాబా, బషీర్, అమాన్, శంకర్ రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుచికి రుచి...ఆరోగ్యానికి ఆరోగ్యం

- చిరుధాన్యాలతో కేక్‌ల తయారీ
- కోవే చాప్టర్ ద్వారా మహిళలకు ఉచితంగా శిక్షణ
- ఇంటి వద్దే తయారు చేస్తున్న మహిళలు
- ఆర్థికంగా కుటుంబాలకు ఆసరాగా ఉంటున్న వైనం



చిరుధాన్యాలతో తయారు చేసిన కేక్ ఇది



మరో రకం కేక్



కోవే చాప్టర్ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు చిరుధాన్యాల ద్వారా కేక్‌లను తయారు చేస్తున్నారు. గత కొంత కాలం నుంచి విజయవాడకు చెందిన కోవే ఏపీ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక ఆధ్వర్యంలో కేక్‌ల తయారీపై పలు చోట్ల ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారం క్రితం విజయవాడలోని భారతీనగర్ కాలనీలో సుమారు 200 మంది మహిళలకు కేక్‌ల తయారీపై నిపుణులతో మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఇక్కడ నేర్చుకున్న మహిళలు తమ ఇళ్ల వద్ద కేక్‌లను తయారుచేసి విక్రయిస్తూ, కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

మైదా లేకుండా కేక్‌ల తయారీ

చిరుధాన్యాలతో మహిళలు పలు రకాల కేక్‌లను తయారు చేస్తున్నారు. రాగి కేక్, చాక్లెట్, బనానా, ఓట్స్, బ్రోనింగ్ చాక్లెట్ కేక్స్, పైనాపిల్‌తో పాటు పలు రకాలైన రుచికరమైన కేక్‌లను తయారు చేస్తున్నారు. వీటి ద్వారా ఆరోగ్యం అధికంగా ఉంటుంది. అంతే కాకుండా మైదా లేకుండా తయారు చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మహిళలు కేక్‌ల తయారీని స్వయం ఉపాధిగా మార్చుకుంటున్నారు. నెలకు వేలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ రంగంలో ఇప్పటి వరకు సుమారు 1500 మందికి కేక్‌ల తయారీపై శిక్షణ ఇచ్చినట్టు కోవే చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక తెలిపారు. తమ వద్ద నేర్చుకున్న వారిలో సుమారు 10 శాతానికి పైగా మహిళలు సొంతంగా ఇళ్ల వద్ద తయారు చేసి విక్రయిస్తూ ఆర్థికంగా వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నారని చెప్పారు. మిగతా 90 శాతం మంది మహిళలు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. వ్యాపారం పెంచుకునేందుకుగాను ఆర్థికంగా బ్యాంకు రుణాలు (ముద్ర రుణాలు) ఇప్పిస్తున్నాం. చాలా మంది చిన్న చిన్న ఫంక్షన్‌లకు కేక్‌లను తయారు చేసి ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాపారం ఆశాజనకంగా ఉంది.



ఇంటి వద్దనే తయారు చేస్తున్నా

నేను ఒక ప్రయివేట్ కాలేజీలో ప్రొఫెసర్‌గా కొంత కాలం పనిచేశా. అక్కడ బాగా ఒత్తిడిగా ఉండడంతో అనారోగ్యానికి గురై ఆ ఉద్యోగానికి రాజీనామా చేశా. ఇటీవల కేక్‌ల తయారీలో శిక్షణ పొంది ఇంటి వద్దే కేక్‌లు తయారు చేస్తున్నా. చిన్న చిన్న ఫంక్షన్‌లకు ఆర్డర్‌లు వస్తున్నాయి. ఎలాంటి టెన్షన్ లేకుండా డబ్బులు సంపాదిస్తున్నా.

– పి.పుష్పలత గవర్నర్‌పేట



కోవే వారి శిక్షణ నాకు ఎంతో మేలు చేసింది

నేను గత కొంత కాలంగా కేక్‌లను తయారు చేస్తున్నా. చిరుధాన్యాలతో పలు రకాల కేక్‌లను తయారు చేస్తున్నా. కేక్‌ల తయారీతో పాటు టైలరింగ్ పని కూడా చేస్తున్నా. రెండింటి మీద ఆదాయం బాగానే వస్తుంది. కేక్‌ల తయారీపై తీసుకున్న శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎస్.పూజిత, నున్న

ఎస్‌ఆర్‌ఆర్‌లో జాతీయ సైన్సు దినోత్సవం



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రం – ఎలక్ట్రానిక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో చిత్ర ప్రదర్శన, ప్రాజెక్టుల ప్రదర్శన, క్విజ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులతో పాటు సిద్ధార్థ కళాశాల, ఇతర కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, రసాయన శాస్త్ర శాఖ అధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు, వృక్ష శాస్త్ర అధిపతి స్వప్న న్యాయ వేత్తలుగా వ్యవహరించారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలే కాదు, మంచి ఉపాధ్యాయులు కావాలంటే సామాన్య శాస్త్రాలనే చదవాలన్నారు. అంశాల వారీగా నిర్వహించిన ప్రదర్శనలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజీ కార్యాలయంతో ఎస్‌ఆర్‌ఆర్ అవగాహన ఒప్పందం



ఏజీ కార్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏజీ కార్యాలయానికి చెందిన తెలుగేతర ఉద్యోగులకు తెలుగు భాషను నేర్పించడం కోసం మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖతో ఏజీ కార్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం గత నాలుగు సంవత్సరాల నుంచీ కొనసాగుతోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీతో గత ఒప్పందం గడువు ముగిసిన కారణంగా తిరిగి కొత్తగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ ఒప్పందం రాబోయే మూడేళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. దీని ప్రకారం ఏజీ కార్యాలయ ఉద్యోగులకు కళాశాల తెలుగు శాఖ తెలుగు భాషను 'తెలుగు పరిచయం కోర్సు' పేరుతో, రోజుకు రెండు గంటలు చొప్పున 48 పని దినాలలో నేర్పిస్తుందని, ఉత్తీర్ణత సాధించిన ఉద్యోగులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఆ ఉద్యోగులకు వారి ఉద్యోగం క్రమబద్ధీకరణ చేస్తారని తెలిపారు.

దర్శకుడు, నిర్మాత రమాశంకర్ మృతి తీరనిలోటు



రమాశంకర్ మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: నిర్మాత, దర్శకుడు, సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు ఒమ్మి రమాశంకర్ మృతి కళారంగానికి తీరనిలోటు అని కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధి కె.డేవిడ్‌రాజు అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం రమాశంకర్ సంతాప సభ నిర్వహించారు. సభలో డేవిడ్ రాజు మాట్లాడుతూ బీఎస్‌పీ నాయకునిగా ఆయన పేదల కోసం ఎంతో కృషి చేశారని, ఎందరో గాయనీ గాయకులను పరిచయం చేశారన్నారు. చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ రమాశంకర్ దివ్యాంగులకు ఉచితంగా సైకిళ్లు అందించారన్నారు. సమావేశంలో మాంతి రమణ, బి.వీరభద్రరావు, మారేపల్లి జోషి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత రమాశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రభుత్వాస్పత్రికి వీల్‌చైర్, స్ట్రెచ్చర్ అందజేత



ప్రభుత్వాస్పత్రిలో వీల్‌చైర్, స్ట్రెచ్చర్ అందజేస్తున్న తరుణ్‌కాకాని, న్యాయమూర్తి చిరంజీవి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రికి వచ్చే నడవలేని రోగులకు ఉపయోగపడేలా కాకాని ఆశయ సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీల్‌చైర్, స్ట్రెచ్చర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని తరుణ్, ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం ఫిబ్రవరి 27న ప్రపంచ ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థలు) దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం, ఆయన తనయుడు దివంగత కాకాని రామమోహన్‌రావు స్మారకార్థం డాక్టర్ తరుణ్ కాకాని స్థాపించిన కాకాని ఆశయ సాధన సమితి స్వచ్ఛంద సంస్థతో పాటు ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, న్యాయమూర్తి చిరంజీవి పాల్గొని ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ నమ్రతకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి గోగినేని ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫ్యాషన్ షో విజేత సుహాన



పాయకాపురం(విజయవాడరూరల్): రవీంద్రభారతి హైస్కూల్ (వాంబేకాలనీ) అజిత్ సింగ్‌నగర్ రవీంద్రభారతి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న షేక్ సుహాన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షోలో మిస్ టీన్‌గా గెలుపొందినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హైదరాబాదులో ఈ నెల 24వ తేదీన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షో జరిగింది. ఈ షోలో టీన్ విభాగంలో జరిగిన పోటీలో మొత్తం 61 మంది పాల్గొనగా షేక్ సుహన మిస్ టీన్‌గా ఎంపికైనట్టు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో సుహాన మాట్లాడుతూ ఈ గెలుపునకు కారణం తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు హైస్కూల్ యాజమాన్యం అని తెలియజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం,హెచ్‌ఓడీలు, జీఎం, జోనల్ ఇన్‌చార్జి సుహానను అభినందించారు.

అప్కోస్ వర్కర్లకు మెగా వైద్య శిబిరం

భారీ సంఖ్యలో హాజరైన పారిశుద్ధ్య కార్మికులు



శానిటరీ కార్మికులకు ఉచిత వైద్య సేవలందిస్తున్న వైద్యులు



సానిటరీ వర్కర్లకు ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగర పాలకసంస్థ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం పాతబస్తీలోని గాంధీజీ నగరపాలక సంస్థ హైస్కూల్ ప్రాంగణంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విజయవాడ శాఖ, ఈఎస్‌ఐ విజయవాడ, ఆంధ్ర హాస్పిటల్స్ సమన్వయంతో జరిగిన ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 400కు పైగా పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు ఈఎస్‌ఐ గురించి అవగాహన కల్పించారు. వారికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పర్సంటేజ్ తదితర ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, చెవి, ముక్కు, గొంతు, డెంటల్, ఆయుర్వేద, హోమియోపతి స్పెషలిస్ట్ డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విజయవాడ డైరెక్టర్ బి.ఆంజనేయులు, ఈఎస్‌ఐ విజయవాడ సూపరింటెండెంట్ డాక్టర్ బి.జ్యోతి, అప్కోస్ జనరల్ మేనేజర్ నాగప్రసాద్, ఈఎస్‌టీ సర్జన్ డాక్టర్ కె.నారాయణరావు, డెంటల్ సర్జన్ డాక్టర్ గౌతమి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సునీత, ఆయుర్వేద వైద్యురాలు శ్యామల, హోమియోపతి వైద్యురాలు సుప్రియ, వైద్యులు ప్రసన్నకుమార్, నిఖిల్, శరత్, అనూషతో పాటు విజయవాడ నగరపాలక సంస్థ మేనేజర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



సభలో మాట్లాడుతున్న నిడుమోలు రమాసత్యనారాయణ తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విద్యావేత్త నిడుమోలు రమాసత్యనారయణ అన్నారు. ఎస్ఎస్‌కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులకు జాతీయ స్థాయి గుర్తింపు ఉంటుందన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తునట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయనీ గాయకుల కృషిని అభినందించారు. సంస్థ అధ్యక్షుడు పైడిపాటి వెంకన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



సురభి కల్చరల్ ఫెస్ట్‌లో బహుమతులు అందుకున్న నలంద విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కేఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన సురభి ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్ –2024లో గాయత్రినగర్‌లోని నలంద విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఆ పోటీల్లో వెస్టన్ గ్రూప్ మ్యూజిక్, బాటిల్ ఆఫ్ బాండ్ జూనియర్ విభాగాల్లో జి.సాహితి, వై.గంగ మేఘనారెడ్డి, పి.విహాన్, పి.రేహాన్‌నాగ్, పి.సుస్వరనందిని, వి.లాస్య, శ్రీశిఖ, బి.పార్థసాయిరెడ్డి, సీహెచ్ హాస్యశ్రీప్రియ ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. సోలో పెర్కషన్ (సంగీత వాయిద్యం) పోటీల్లో పి.రేహాన్‌నాగ్ ప్రథమ బహుమతి పొందగా, సింగింగ్ జోడి సీనియర్ విభాగంలో రూపేష్ కేశవ్ ఆనంద్, జి సూర్య సిద్ధార్థ తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ విజేతలను అభినందించారు. పోటీల్లో గెలుపొందేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సౌమ్యరూప్ ముఖర్జీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రేపు లలితాదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నరసింహారావుపాలెం(వీరులపాడు): లలితాదేవి పంచాయత ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామం అగస్త్య పీఠంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠంలో గురువారం ఉదయం 10.30 గంటలకు లలితాదేవి పంచాయత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, పసుపులేటి సాయిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న దేవదాయ శాఖ ఏసీ శాంతి



పూర్ణాహుతిలో పాల్గొన్న ఏసీ శాంతి, పక్కన ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారిని మంగళవారం జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే శాంతి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, విజయవాడ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సిలువగిరి తిరునాళ్లు

నందిగామ: పట్టణ శివారులో గల సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సువార్త స్వస్థత ప్రార్థనలు, సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించారు.